క్లుప్తంగా

ఎల్‌వోసీ అందజేత



ఎల్‌వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే చందర్

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని పెద్దంపేటకు చెందిన ఉప్పుల రాజమణి కిడ్నీ వ్యాధితో బాధపడుతోంది. నిరుపేద కుటుంబానికి చెందిన బాధితురాలి శస్త్రచికిత్సకు ఆర్థిక సాయం చేయాలని ఎంపీటీసీ కొలిపాక శరణ్య ఎమ్మెల్యే ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌కు వివరించారు. కాగా స్పందించిన ఎమ్మెల్యే సీఎం సహాయనిధి కింద రూ.1.25లక్షల ఎల్‌వోసీ చెక్కును బాధిత కుటుంబానికి అందజేశారు.
గోదావరిఖని: అడ్డగుంటపల్లికి చెందిన చిలారపు అయిలయ్య మోకాళ్ల చికిత్సకు రూ.లక్ష విలువైన ఎల్‌ఓసీ చెక్కును ఎమ్మెల్యే కోరుకంటి చందర్ బుధవారం అందించారు.

ఇంటింటికీ త్రివర్ణ పతాకం

కమాన్‌పూర్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 'హర్ ఘర్ తిరంగ్' కార్యక్రమంలో ఇంటింటికీ తివర్ణ పతాకం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఐపీవో మోహన్ బుధవారం తెలిపారు. సెంటినరీకాలనీలోని పోస్టాఫీసులో సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోస్టాఫీసు సేవల గురించి సింగరేణి, పోలీసు అధికారులను కలిసి వివరించినట్లు తెలిపారు. సత్యనారాయణ, నరేంద్రచారి, శంకరయ్య పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లకు అండగా ఉంటా



లైసెన్సు పత్రాలు అందిస్తున్న దాసరి ఉష

పెద్దపల్లిరూరల్: ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్న డ్రైవర్లకు అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి తనవంతు సహకారం అందిస్తానని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష అన్నారు. ఆటో డ్రైవర్లుగా పనిచేస్తున్న వారిలో డ్రైవింగ్ లైసెన్సు లేనివారికి తన సొంత ఖర్చుతో బుధవారం లైసెన్సు పత్రాలు అందజేశారు. రోడ్డుపై వాహనాలు నడిపే సమయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఆటో యూనియన్ నాయకులు అఫ్జల్, మహమ్మదాలీ, జాకీర్, తన్వీర్, ఆరిఫ్, తాజ్, హమీద్, సమీర్, నసీర్ లోకమాన్ ఉన్నారు.

గొర్రెల యూనిట్లు పంపిణీ

కమాన్‌పూర్: రామగిరి మండలం రత్నాపూర్ గ్రామానికి చెందిన 12 మందికి మంజూరైన గొర్రెల యూనిట్లను బుధవారం ఎంపీపీ ఆరెల్లి దేవక్క, జెడ్పీటీసీ మ్యాదరవేన శారద, సర్పంచ్ పల్లె ప్రతిమ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి దుర్గాప్రసాద్‌రెడ్డి, నాయకులు బుద్దుల తిరుపతి, బత్తిని ప్రశాంత్, కొమురయ్య, కుమార్, పీవీ రావులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

'గృహలక్ష్మి' దరఖాస్తు గడువు పెంచాలి



మాట్లాడుతున్న సునీల్‌రెడ్డి

మంథని: ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు గడువు పెంచాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పథకంపై ప్రజలకు అవగాహన లేకుండానే తక్కువ గడువు పెట్టి ఇబ్బందులకు గురిచేయడం సమంజసం కాదని, మరికొన్ని రోజులు దరఖాస్తు చేయడానికి అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లా అధికార ప్రతినిధి పోతరవేన క్రాంతికుమార్, అసెంబ్లీ కోకన్వీనర్ నాంపల్లి రమేశ్, మండల అధ్యక్షుడు వీరబోయిన రాజేందర్, పట్టణ అధ్యక్షుడు బూడిద తిరుపతి ఉన్నారు. అలాగే గృహలక్ష్మి దరఖాస్తు స్వీకరణ గడువు పెంచాలని డిమాండ్ చేస్తూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మీ సేవా కేంద్రాల వద్ద నిరసన తెలిపారు. గృహలక్ష్మి పథకానికి రూ.5లక్షలు కేటాయించాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి బూడిద గణేశ్, జిల్లా ఉపాధ్యక్షుడు బావు రవి డిమాండ్ చేశారు.

చెక్కు అందజేత

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలం గర్రెపల్లికి చెందిన జనసేన పార్టీ క్రియాశీలక జన సైనికుడు పులి పవన్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. కాగా పార్టీ అధ్యక్షుడే పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు బుధవారం రూ.50వేల విలువ గల చెక్కును నియోజకవర్గ క్రియాశీలక వలంటరీ హరికృష్ణ ఆధ్వర్యంలో పవన్‌కు అందించారు. జనసేన నాయకులు శివ, అజయ్, నీరజ్, శ్రీకాంత్, సతీష్, సాగర్, అనిల్, వినయ్ ఉన్నారు.

'గృహలక్ష్మి'కి అర్హులం కాదా?

- 19వ డివిజన్‌కు పథకం వర్తింపజేయాలని డిమాండ్
- నాడు సింగరేణి ఇచ్చిన 2వేల ప్లాట్లకు పట్టాలు లేవు
- దరఖాస్తుకు నేడు చివరి తేదీ
- ఆందోళన చెందుతున్న డివిజన్ వాసులు



న్యూమారేడుపాక గ్రామం

గోదావరిఖని: సింగరేణి ప్రభావిత గ్రామమైన 19వ డివిజన్ న్యూమారేడుపాక గ్రామంలోని ప్రజలు గృహలక్ష్మి పథకం పొందలేక పోతున్నారు. పునరావాసం కింద ఆర్జీ–2 ఏరియా సింగరేణి యాజమాన్యం 25 ఏళ్ల క్రితం పెంచికల్‌పేట శివారులో, న్యూమారేడుపాకలో, అల్లూరు శివారులో కలుపుకొని మొత్తం దాదాపు 2వేల ప్లాట్లను సింగరేణి వారు కేటాయించారు. అందులో నాటి ప్రభుత్వం ద్వారా కేవలం 50 ఇళ్లకు పట్టాలు మంజూరు చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు సింగరేణి యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో మిగిలిన ఇళ్లకు పట్టాలు ఇవ్వకుండా కాలయాపన చేశారని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గృహలక్ష్మి పథకం సింగరేణి ప్రభావిత గ్రామం న్యూమారేడుపాక 19వ డివిజన్‌కు వర్తించకపోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్, ప్రత్యేక చొరవ తీసుకొని, కలెక్టర్, సింగరేణి యాజమాన్యంతో మాట్లాడి ఇళ్లకు పట్టాలు ఇప్పించి గృహలక్ష్మి పథకం అమలయ్యేలా చూడాలని న్యూమారేడుపాక గ్రామ ప్రజలు కోరుతున్నారు.

పథకం వర్తింపజేయాలి



సింగరేణి ఇచ్చిన స్థలంలో ప్రస్తుతం రేకులతో ఇళ్లను నిర్మించుకున్న వారితో పాటు ఖాళీస్థలం ఉన్న వారికి గృహలక్ష్మి పథకం అమలు చేయాలి.
– తాళ్ల రాజ్‌కుమార్, న్యూమారేడుపాక

న్యాయం చేయండి



ఇళ్లు లేక చాలా అవస్థలు పడుతున్నాం. సింగరేణి వారు ఇచ్చిన ప్లాట్లకు కూడా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న గృహలక్ష్మి పథకం వర్తింప చేసి మాకు న్యాయం చేయండి.
– పోచమ్మ, న్యూమారేడుపాక

ఎమ్మెల్యే చొరవ తీసుకోవాలి



దాదాపు 2వేల మందికి సింగరేణి వారు కేటాయించిన ప్లాట్లకు కేవలం వారు రాసి ఇచ్చిన చిట్టీలు మాత్రం ఉన్నాయి. వాటికి పట్టాలు ఇవ్వకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఈ విషయంపై ప్రత్యేక చొరవ తీసుకొని గృహలక్ష్మి పథకం అమలయ్యేలా చూడాలి.
– తాళ్ల అమృత, డివిజన్ కార్పొరేటర్

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘాలు

గోదావరిఖనిటౌన్: ఉపాధ్యాయ ఉద్యోగ సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ(యూఎస్‌పీసీ) ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ప్రభుత్వ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా స్టీరింగ్ కమిటీ నాయకులు, ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గద్దె శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం జూన్ 30తో పీఆర్సీ గడువు ముగిసినా ఇంతవరకు కమిటీ ఏర్పాటు చేయలేదని, వెంటనే కమిటీ ఏర్పాటు చేసి మధ్యంతర భృతిని ప్రకటించాలని కోరారు. సమస్యల పరిష్కారానికై 12న జిల్లా కేంద్రంలో నిరసన ర్యాలీ చేపడతామని, అయినప్పటికీ సమస్యలు పరిష్కరించకపోతే సెప్టెంబర్ 1న ఛలో హైదరాబాద్ మహాధర్నా నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. సంఘం నాయకులు ఈర్ల రమేశ్, భవాని, వెంకటరాజం, కనకయ్య, శాస్త్రి, కుమార్‌రెడ్డి, లూర్దు మేరీ, రమ, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ వేడుకలు



వేడుకల్లో యూత్ కాంగ్రెస్ నాయకులు

మంథని: యూత్ కాంగ్రెస్ 63వ ఆవిర్భావ వేడుకలను మంథనిలో ఘనంగా జరుపుకున్నారు. బుధవారం మంథనిలో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు బర్ల శ్రీనివాస్ కాంగ్రెస్ జెండా ఆవిష్కరణ చేశారు. స్థానిక ప్రధాన చౌరస్తాలో కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జెమినీగౌడ్, నాయకులు ఎరుకల ప్రవీణ్, ఆర్ల నాగరాజు, ఆరెల్లి కిరణ్, బండారి ప్రసాద్ ఉన్నారు.
రామగిరి మండల కేంద్రంలో..
కమాన్‌పూర్: రామగిరి మండల కేంద్రంలో బుధవారం యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. దాసరి శివ, తోట చంద్రయ్య, కొప్పుల గణపతి, కాటం సత్యం, చిందం మహేశ్, బండారి సదానందం, ముస్త్యాల శ్రీనివాస్, పబ్బతి రాధారెడ్డి, కోట రవీందర్‌రెడ్డి, రాంనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కూల్‌బ్యాగులు అందజేత



స్కూల్‌బ్యాగ్ అందజేస్తున్న జెడ్పీటీసీ సంధ్యారాణి

పాలకుర్తి: పాలకుర్తి, ఈసాలతక్కళ్లపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు బుధవారం అర్ష ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా స్కూల్‌బ్యాగులు అందజేశారు. కార్యక్రమానికి పాలకుర్తి జెడ్పీటీసీ కందుల సంధ్యారాణి పాల్గొని పిల్లలకు బ్యాగ్‌లు అందజేశారు. హెచ్‌ఎంలు సత్యనారాయణరెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

తహసీల్దార్ల బదిలీ

పెద్దపల్లిరూరల్: సాధారణ ఎన్నికల నేపథ్యంలో పొరుగు జిల్లాల నుంచి బదిలీపై జిల్లాకు కేటాయించిన 4గురు తహసీల్దార్లకు బుధవారం నియామక ఉత్తర్వులు అందించడంతో పాటు ఇప్పటికే జిల్లాలో విధులు నిర్వహిస్తున్న ముగ్గురు తహసీల్దార్లను బదిలీ చేస్తూ ఆదేశాలిచ్చామని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా నుంచి బదిలీపై వచ్చిన మధుసూదన్‌రెడ్డికి సుల్తానాబాద్ తహసీల్దార్‌గా బాధ్యతలు అప్పగించారు. సుల్తానాబాద్ తహసీల్దార్‌గా పనిచేస్తున్న రజితను ధర్మారం తహసీల్దారుగా బదిలీ చేశారు. అలాగే మంచిర్యాల జిల్లా నుంచి వచ్చిన మోహన్‌రెడ్డిని కమాన్‌పూర్ తహసీల్దార్‌గా, రామచందర్‌ను రామగిరి తహసీల్దార్‌గా నియమించారు. రామగిరి తహసీల్దార్‌గా పనిచేస్తున్న వాసంతిని పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి కార్యాలయ పరిపాలన అధికారిగా బదిలీ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. హనుమకొండ జిల్లా నుంచి వచ్చిన బి.రాజేశ్వరిని ముత్తారం(మంథని) తహసీల్దార్‌గా నియమించి, ధర్మారం తహసీల్దారుగా పనిచేస్తున్న జాహేద్ పాషాను శ్రీరాంపూర్ తహసీల్దార్‌గా బదిలీ చేసినట్లు కలెక్టర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఓదెల: పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఉప్పరపల్లెకు చెందిన బోయిని కనుకయ్య(48) చికిత్సపొందుతూ బుధవారం మధ్యాహ్నం మృతిచెందాడు. పొత్కపల్లి ఎస్సై నూతి శ్రీధర్ కథనం ప్రకారం అప్పుల భారంతో మద్యానికి బానిసైన కనుకయ్య 6న ఇంటి ఎదుట పురుగుల మందుతాగగా చికిత్స కోసం సుల్తానాబాద్ హాస్పిటల్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో కరీంనగర్ హాస్పిటల్‌కు తరలించారు. కాగా చికిత్సపొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య గట్టమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఏఐటీయూసీ ఆర్జీ–3 ఏరియా బ్రాంచ్ కమిటీ ఎన్నిక

కమాన్‌పూర్: ఆర్జీ–3 ఏరియా ఏఐటీయూసీ బ్రాంచ్ కమిటీని బుధవారం ఎన్నుకున్నట్లు ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య తెలిపారు. బ్రాంచ్ కార్యదర్శిగా ఎంఆర్‌సీ.రెడ్డి, ఇన్‌చార్జిగా జూపాక రాంచందర్, ఉపాధ్యక్షుడిగా కందికట్ల సమ్మయ్య, అసిస్టెంట్ కార్యదర్శిగా డీటీ.రావు, జాయింట్ సెక్రటరీగా రవికుమార్, మైనింగ్ స్టాఫ్ ఇన్‌చార్జిగా డి.శ్రీనివాస్, ట్రేడ్‌మెన్ ఇన్‌చార్జిగా ఎస్‌వీ.రావు, ట్రెజరర్‌గా సాంబశివారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా బాధవత్ రాజేశ్, మర్థ కిరణ్‌కుమార్, బుర్ర శ్రీనివాస్, పోశం, మల్లేశ్‌ను ఎన్నుకున్నారు. వీరభద్రయ్య, వైవీ.రావు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

కమాన్‌పూర్: మండలంలోని జూలపల్లికి చెందిన బోయిన లావణ్యకు ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.10వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును బుధవారం బీఆర్‌ఎస్ నాయకులు పంపిణీ చేశారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, సర్పంచ్ బొల్లపెల్లి శంకర్‌గౌడ్, ఉపసర్పంచ్ సాయి, ఏఎంసీ వైస్‌చైర్మన్ లక్ష్మిమల్లు, అనిల్, మల్లేశ్, సంపత్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

✦సదస్సును విజయవంతం చేయండి
మంథని: ఈ నెల 11న గోదావరిఖనిలో నిర్వహించే సదస్సుకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ రానున్నారని, మంథని నుంచి పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని జిల్లా ఇన్‌చార్జి కలువాల శరత్ కోరారు. మంథనిలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. తమ న్యాయమైన సమస్యల సాధనకు ఏర్పాటు చేసిన సదస్సును విజయవంతం చేయాలన్నారు. మండల ఇన్‌చార్జి మంద కుమార్, మంథని చందు, గాడెపు బానేష్, జనగామ సంతోష్, బూడిద రమేశ్, కాసిపేట ప్రభాకర్ ఉన్నారు.

✦ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఏర్పాటు
మంథని: ఎమ్మార్పీఎస్ మంథని మండల శాఖకు నూతన కార్యవర్గం ఎన్నికైంది. బుధవారం మంథనిలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో జరిగిన సమావేశంలో అధ్యక్షుడిగా జనగామ సంతోష్, ప్రధాన కార్యదర్శిగా బూడిద రమేశ్, సలహాదారుడిగా కాసిపేట ప్రభాకర్‌ను ఎన్నుకున్నారు.

✦మొక్కలను సంరక్షించాలి
సుల్తానాబాద్: హరితహారంలో భాగంగా నాటిన మొక్కలను సంరక్షించాల్సిన బాధ్యత పౌరులపై ఉందని సింగిల్‌విండో డైరెక్టర్ గాజుల రాజమల్లు అన్నారు. రెండో వార్డులో బుధవారం కౌన్సిలర్ గాజుల లక్ష్మితో కలిసి మొక్కలు పంపిణీ చేశారు.

✦విద్యార్థులకు యూనిఫాం పంపిణీ
కమాన్‌పూర్: మండలంలోని రత్నాపూర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు స్కూల్ యూనిఫాం బుధవారం ఎంఈవో పల్లెపాటి సంపత్‌రావు పంపిణీ చేశారు. సర్పంచ్ పల్లె ప్రతిమ, ఎంపీటీసీ దుర్మల రాజసంపత్, పాఠశాల హెచ్‌ఎం వేగోళపు సదానందం, ఎస్‌ఎంసీ చైర్మన్ నగునూరి శ్రీనివాస్, పీ.వీ.రావు పాల్గొన్నారు.

✦గద్దర్‌కు నివాళి
గోదావరిఖనిటౌన్: గోదావరిఖని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రజా యుద్ధనౌక గాయకుడు గద్దర్ సంతాప సభ బుధవారం నిర్వహించారు. బార్ అసోసియేషన్ నాయకులు గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అసోసియేసన్ అధ్యక్షుడు చక్రపాణి, నాయకులు రమేశ్, ప్రకాష్, కుమార్, శ్రీనివాస్, రవి, అనురాధ, మేరుగు మల్లేశ్ పాల్గొన్నారు.


✦ఆధార్, ఆహారభద్రత కార్డుతో దరఖాస్తు చేయొచ్చు
మంథని: గృహలక్ష్మి పథకం దరఖాస్తుకు కేవలం ఆధార్, ఆహారభద్రత కార్డు సమర్పిస్తే దరఖాస్తు స్వీకరిస్తామని తహసీల్దార్ రాజయ్య తెలిపారు. కులం, ఆదయ, భూ సంబంధిత పత్రాలు విచారణ సమయం నాటికి అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

✦మిద్దె రాములు జయంతి ఉత్సవాలు విజయవంతం చేయాలి
కమాన్‌పూర్: మంథని పట్టణంలో గురువారం నిర్వహించే తెలంగాణ ఒగ్గుకథ కళాకారుడు స్వర్గీయ మిద్దె రాములు జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఒగ్గుకథ కళాకారుడు కొండ్ర వెంకన్న గౌడ్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు.

✦నియామకం
కోల్‌సిటీ: గోదావరిఖనికి చెందిన పైడిపెల్లి సాయికృష్ణగౌడ్, సమాచార హక్కు సంరక్షణ సమితి ఉమ్మడి కరీంనగర్ జిల్లా కన్వీనర్‌గా నియమితులయ్యారు.

✦సెల్‌ఫోన్ అప్పగింత
పెద్దపల్లిరూరల్: పట్టణంలోని సుభాష్‌నగర్‌కు చెందిన బండోజు కృష్ణమాచారి నెలరోజుల కింద పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను పోలీసులు కనుగొన్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం (సీఈఐఆర్)తో ఫోన్ లొకేషన్ ద్వారాఫోన్ కనుగొని కృష్ణమాచారికి అప్పగించారు.

కార్మిక వ్యతిరేక చట్టాలు వెనక్కి తీసుకోవాలి



ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

కమాన్‌పూర్: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న విధివిధానాలను నిరసిస్తూ రామగిరి మండలం సెంటినరీకాలనీలో మంథని–పెద్దపల్లి ప్రధాన రహదారిపై ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడి సీతారామయ్య మాట్లాడుతూ సింగరేణి సంస్థలో కార్మిక వ్యతిరేక చట్టాలను తీసుకొచ్చి బొగ్గు గనులను ప్రయివేటీకరణ చేయడానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పూనుకున్నాడని ఆరోపించారు. ఇప్పటికైనా కార్మిక వ్యతిరేక చట్టాలను వెనక్కి తీసుకోవాలని, లేకుంటే కార్మిక సంఘాలతో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. నాయకులు వీరభద్రయ్య, వైవీ రావు, ఎంఆర్‌సీ రెడ్డి, జూపాక రాంచందర్, సమ్మయ్య పాల్గొన్నారు.

రోడ్లపై చెత్త వేస్తే చర్యలు తప్పవు



అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ కమిషనర్

కోల్‌సిటీ: రోడ్లపై చెత్త వేస్తే చర్యలు తప్పవని రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ త్రియంబకేశ్వర్‌రావు తెలిపారు. పలు డివిజన్లతోపాటు గోదావరిఖనిలోని లక్ష్మీనగర్‌లో బుధవారం పారిశుధ్యం పనితీరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యాపార కేంద్రాల ఎదుట భారీగా చెత్త పేరుకుపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యాపారస్తులు దుకాణాల నుంచి వచ్చే చెత్తను శానిటేషన్ ట్రాక్టర్లు, ఆటోట్రాలీలో మాత్రమే వేయాలని సూచించారు. రోడ్లపై చెత్త పడేస్తే మున్సిపల్ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నగర పరిశుభ్రత కోసం ప్రజలతోపాటు వ్యాపారస్తులు కూడా సహకరించాలని కోరారు. చెత్త పేరుకుపోయిన దుకాణాల వ్యాపారస్తులకు అక్కడికక్కడే కౌన్సెలింగ్ నిర్వహించారు. డిప్యూటీ కమిషనర్‌తో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రంగు నాగభూషణం, సూపర్‌వైజర్ దయానంద్ గాంధీ ఉన్నారు.

18వ తేదీ వరకు మద్యంషాపుల దరఖాస్తు స్వీకరణ

జ్యోతినగర్: మద్యంషాపుల దరఖాస్తుల స్వీకరణ గడువు 18న సాయంత్రం 5 గంటలతో ముగుస్తుందని రామగుండం ఎక్సైజ్ సీఐ సుంకరి రమేశ్ అన్నారు. ఎన్టీపీసీ రామగుండం కృష్ణానగర్‌లోని శ్రీమయి గ్రాండ్ హాలులో బుధవారం జరిగిన మద్యం షాపులపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రామగుండం నియోజకవర్గం పరిధిలో మొత్తం 27 ఎ4 మద్యంషాపులు ఉన్నాయని, దీంట్లో రెండు ఎస్సీ, మూడు బీసీ(గౌడ్స్)లకు రిజర్వ్‌డ్ అయినట్లు పేర్కొన్నారు. మిగిలిన 22 దుకాణాలకు ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తుదారులు రూ.2లక్షల డీడీతో పాటు సెల్ఫ్ అటెస్టేషన్ చేసిన ఆధార్, పాన్‌కార్డు కాపీలు, మూడు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

కోనోకార్పస్ చెట్లతో ప్రజల ప్రాణాలకు ముప్పు



మొక్కలను పరిశీలిస్తున్న సొసైటీ నాయకులు

జ్యోతినగర్: రాజీవ్ రహదారిపై పర్యావరణానికి ముప్పుగా ఉన్న కోనోకార్పస్ మొక్కలను వెంటనే తొలగించాలని ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షుడు మద్దెల దినేశ్, ఉపాధ్యక్షులు రేణికుంట్ల నరేంద్ర, హనుమండ్ల వెంకటేశ్, అనిల్ కుమార్ కోరారు. ఎన్టీపీసీ రామగుండం టెంపరరీ టౌన్‌షిప్‌లోని కాలుష్య నియంత్ర బోర్డు అధికారి కార్యాలయంలో బుధవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మొక్కలను పరిశీలించి మాట్లాడారు. కోనోకార్పస్, పచ్చదనం మాటున విరివిగా పెరుగుతున్న ఈ వృక్షాలు ప్రజారోగ్యానికి, పర్యావరణానికి పెను ప్రమాదకరంగా మారనున్నాయని తెలిపారు. రామగుండం నగరపాలక సంస్థ పరిధిలోని డివైడర్ల మధ్యలో, మరికొన్ని ప్రాంతాల్లో ఉన్నాయని, వాటితో ప్రజలకు ఎలాంటి ప్రమాదం రాకముందే తొలగించాలని సూచించారు.

మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి కృషి



బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్న ముదిరాజ్‌లు

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి అండగా ఉంటానని మత్స్యపారిశ్రామిక సహకార సంఘ జిల్లా అధ్యక్షుడు కొలిపాక నర్సయ్య అన్నారు. ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలో బుధవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన కొలిపాక నర్సయ్యను ఘనంగా సత్కరించారు. మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వ పరంగా అమలవుతున్న పథకాలను అందించేందుకు సహకారం అందిస్తానన్నారు. నాయకులు కొలిపాక శ్రీనివాస్, చిరంజీవి, మల్లికార్జున్, ముత్యాల రాజయ్య, చుంచు సదయ్య, గుండ లక్ష్మణ్ తదితరులున్నారు.

'చలో కోరుట్ల' పద్మశాలీ యుద్ధబేరి పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

కోల్‌సిటీ/గోదావరిఖనిటౌన్: గోదావరిఖని మార్కండేయకాలనీలోని పద్మశాలీ కమ్యూనిటీ భవనంలో బుధవారం పద్మశాలీ సేవా సంఘం ఆధ్వర్యంలో నాయకులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈనెల 13న జరగనున్న 'చలో కోరుట్ల' పద్మశాలీ యుద్ధభేరి పోస్టర్‌ను ఆవిష్కరించారు. యుద్ధభేరి సమావేశానికి భారీ సంఖ్యలో పద్మశాలీలు తరలిరావాలని పిలుపునిచ్చారు. సంఘం జిల్లా అధ్యక్షుడు వేముల రామ్మూర్తి, జిల్లా ఉపాధ్యక్షుడు సాహిరి మహేందర్, రామగుండం కార్పొరేషన్ ఏరియా పద్మశాలీ సేవా సంఘం ప్రధాన కార్యదర్శి ఆడెపు శంకర్, నాయకులు కొలిపాక సత్తయ్య, అందె సదానందం పాల్గొన్నారు.
పోస్టర్ ఆవిష్కరణ
యైటింక్లయిన్‌కాలనీ: యైటింక్లయిన్‌కాలనీ పద్మశాలీ సేవా సంఘం నాయకులు బుధవారం గోదావరిఖని పద్మశాలీ కమ్యూనిటీ భవనంలో చలో కోరుట్ల పోస్టర్ ఆవిష్కరించారు. 13న కోరుట్లలో నిర్వహించనున్న పద్మశాలి యుద్ధబేరి చలో కోరుట్ల సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కాలనీ పద్మశాలీ సేవా సంఘం అధ్యక్షుడు దేవనపల్లి చక్రపాణి, జిల్లా అధ్యక్షుడు రామ్మూర్తి, నాయకులు మహేందర్, రాజేశ్, సత్యనారాయణ, శంకర్, రాజేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.


చామనపల్లిలో సర్వే షురూ



సర్వే చేస్తున్న అధికారులు

ధర్మారం: నంది మేడారం రిజర్వాయర్ నీటితో ముంపునకు గురవుతున్న మండలంలోని చామనపల్లి గ్రామంలో బుధవారం నీటి పారుదలశాఖ అధికారులు సర్వే ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ తిరుపతితో పాటు స్థానిక నాయకులు వెంట ఉండగా అధికారులు ఇంటింటా తిరుగుతూ వివరాల సేకరణతో పాటుగా ముంపునకు గురవుతున్నాయని భావిస్తున్న ఇళ్లకు నంబర్లు వేశారు. గతంలోనే ముంపునకు గురవుతాయని సర్వే చేసిన ఇళ్లకు ప్రస్తుతం ఒకటో ఇంటి నంబర్‌తోపాటు క్రమంగా నెంబర్లు వేసి ఎన్ని ఇల్లు ముంపునకు గురవుతున్నాయనే ఉన్నతాధికారులకు నివేదిక కోసం నంబర్లు వేస్తున్నారు. గ్రామానికి చెందిన టీఆర్‌ఎస్ నాయకులు పాలమాకుల మహేందర్‌రెడ్డి, ఈదుల రాజేందర్‌రెడ్డి, వేల్పుల రమేశ్, కొమురవెల్లి నాగరాజు, నెట్టు సదయ్య పాల్గొన్నారు.

గృహలక్ష్మి పథకానికి భారీగా దరఖాస్తులు



సుల్తానాబాద్ మున్సిపల్ కార్యాలయంలో..

జూలపల్లి: ఇల్లు లేని నిరుపేదలకు ప్రభుత్వం అందించనున్న రూ.3లక్షల సహాయమైన గృహలక్ష్మి పథకానికి బుధవారం భారీగా దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తు చేసుకోవడానికి గురువారం ఆఖరు కావడంతో మండలంలోని గ్రామాల నుంచి భారీగా తరలివచ్చి దరఖాస్తులు సమర్పించారు. బుధవారం 445 దరఖాస్తులు వచ్చాయి. మూడు రోజుల్లో 542 దరఖాస్తులు వచ్చినట్లు డీటీ అబూబాకర్ తెలిపారు.
మున్సిపల్ కార్యాలయంలో..
సుల్తానాబాద్: సుల్తానాబాద్ మున్సిపల్ కార్యాలయంలో గృహలక్ష్మి లబ్దిదారులు దరఖాస్తులు అందజేశారు. గురువారం చివరి తేదీ కావడంతో లబ్ధిదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీత కోరారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పెద్దపల్లి జిల్లా: 9951602934
Office mail: knrjagati@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
మంథని: రాజేశ్ - 9676603963
పెద్దపల్లి: సురేశ్ - 8639544665
రామగుండం: సర్వర్ - 6281694028
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899